శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

డేటా ఎంట్రీ నమోదుపై శిక్షణ

భువనగిరి కలెక్టరేట్, జనవరి 23 : ఎన్నికల నిర్వహణలో పట్టుబడే వస్తువులకు సంబంధించిన డేటా ఎంట్రీ నమోదుపై కేంద్ర ఎన్నికల కమిషన్ మాస్టర్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ విధానాన్ని పోర్టల్‌లో నమోదు చేసే విధానంపై వివిధ రాష్ట్రాల, జిల్లాల నోడల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వైవల్ బృందాలకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే, జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్, పంచాయతీ అధికారి సునంద, మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

యాదయ్య కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రమాద బీమా చెక్కు అందజేత

ఆత్మకూరు(ఎం), జనవరి 23 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కొమ్మరాజుల యాదయ్య కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును మంగళవారం బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, ఎంపీటీసీ యాస కవిత, జిల్లా నాయకులు కోరె భిక్షపతి, గ్రామశాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణ, మండల ప్రధాన కార్యదర్శి బూడిద శేఖర్‌గౌడ్, అజీమొద్దీన్, విజయ్, రాజు, అశోక్ పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

పీఆర్ఎంఈయూ క్యాలెండర్ ఆవిష్కరణ

భువనగిరి కలెక్టరేట్, జనవరి 23 : జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం 2024 క్యాలెండర్‌ను జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఆలేరు జడ్పీటీసీ డాక్టర్ కుడుదుల నగేశ్, జడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, సభ్యులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్...

భువనగిరి అర్బన్, జనవరి 23 : టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తన కార్యాలయంలో డీఈఓ నారాయణరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు వెంకట్‌రెడ్డి, పరిపూర్ణాచారి, బొక్క వెంకట్‌రెడ్డి, బయ్య లింగయ్య, ఎన్.కృష్ణభగవత్, సత్యనారాయణరెడ్డి, కర్నాటి శేఖర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

రోడ్డు ఆక్రమణపై డీఎల్‌పీఓకు ఫిర్యాదు

గుండాల, జనవరి 23 : మండల కేంద్రంలో పంచాయతీ రోడ్డును ఆక్రమించి వెల్డింగ్ దుకాణం నిర్మించిన విషయమై గుండాలకు చెందిన అన్నెపర్తి మల్లయ్య, శ్రీపతి వరమ్మ, అన్నెపర్తి యాదగిరి, శ్రీపతి లింగయ్య భువనగిరి డీఎల్‌పీఓ యాదగిరికి మంగళవారం ఫిర్యాదు చేశారు. మండల కేంద్రానికి చెందిన బంగారోజు ఉపేంద్రాచారి రోడ్డును ఆక్రమించి షాపు పెట్టాడని, రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మిస్తున్నాడని, వాటిని వెంటనే తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● ఆ సంఘం ఆలేరు నియోజకవర్గ అధ్యక్షుడు మల్లయ్య

రాజాపేట, జనవరి 23 : విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం ఆలేరు నియోజకవర్గ అధ్యక్షుడు సీహెచ్ మల్లయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు, నూతన సభ్యత్వం, పెన్సనర్స్ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, పరిగెల రాములు, యాదగిరి, మల్లేశం, బల్ల దామోదర్, వంచ ఉపేందర్‌రెడ్డి, మధుసూదన్, బిర్రు సుదర్శన్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వలిగొండ, జనవరి 23 : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన చేగూరి శంకరయ్య పొలం నాటు వేస్తున్న సమయంలో అడుగు మందు తిని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది బాధితుడిని చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఇంద్రపాలనగరం గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న వీరారెడ్డి

రామన్నపేట, జనవరి 23 : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామపంచాయతీని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామపంచాయతీ ద్వారా వసూలు చేస్తున్న ట్యాక్స్ రశీదులను పరిశీలించారు. అలాగే హైస్కూల్, ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, చెరువు తూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఎంపీఓ అంజిరెడ్డి, ఏపీఓ వెంకన్న, వార్డు సభ్యులు పూస బాలనర్సయ్య, కాటేపల్లి యాదయ్య, పంచాయతీ కార్యదర్శి రసూల్ ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్ల పరిశీలన

భువనగిరి అర్బన్, జనవరి 23 : రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనవరి 26న నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లను వెంటనే పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట భువనగిరి ఆర్డీఓ అమరేందర్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తాసీల్దార్ అంజిరెడ్డి, జిల్లా యువజన అధికారి ధనుంజయ్, ఇతర అధికారులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

● చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్, జనవరి 23 : వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో మిషన్ భగీరథ, పురపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు, పలు వార్డుల నీటి సరఫరా సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది వానలు సరిగా లేనందున నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. నీటి వృథాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈఈలు సాయిబాబ, సందీప్‌రెడ్డి, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ విభాగంలో ఎంపికైన ప్రయోగంతో నవీన్

రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఆదర్శ' ఎగ్జిబిట్స్

బొమ్మలరామారం, జనవరి 23 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ నుంచి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు రెండు ఎగ్జిబిట్స్ ఎంపికయ్యాయి. ఉపాధ్యాయ విభాగంలో వినూత్న బోధన సామగ్రి ప్రదర్శనలో ఉపాధ్యాయుడు కోటం నవీన్‌కుమార్ తయారు చేసిన త్రీడీ మాలిక్యూల్ నమూనాలు, విద్యార్థి విభాగంలో కమ్యూనికేషన్ రంగంలో 8వ తరగతి విద్యార్థి వెంకటేశ్, గైడ్ టీచర్ దుగ్యాల శివప్రియ సహకారంతో తయారు చేసిన వరదల సమయంలో మ్యాన్‌హోల్స్ గుర్తింపు నమూనాలు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శోభారాణి మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయుడు, విద్యార్థిని అభినందించారు.

ఎంపికైన విద్యార్థి వెంకట్ ధనుశ్‌తో గైడ్ శివప్రియ

నేడు మంత్రి కోమటిరెడ్డి రాక

బొమ్మలరామారం/ఆత్మకూర్(ఎం), జనవరి 23 : బొమ్మలరామారం మండలం మైలారంలో నూతనంగా నిర్మించిన ప్రైమరీ హెల్త్ సబ్ సెంటర్, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం, హాజీపూర్‌లోని శామీర్‌పేట వాగుపై బ్రిడ్జి, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నేడు రానున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సింగిర్తి మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఆత్మకూరు(ఎం) మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

చేనేత ఉత్పత్తిదారుల సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

● భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23 : పద్మశాలి చేనేత చీరల ఉత్పత్తిదారుల సంఘ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ కోరారు. మంగళవారం స్థానిక చేనేత కార్మిక చీరల ఉత్పత్తిదారుల సంఘం సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాలానుగుణంగా చేనేత వస్త్రాలను నాణ్యత, నవ్యతతో రూపొందించాలని సూచించారు. ప్రింటెడ్ చీరలతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత డిజైన్లు ప్రింటెడ్ కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎన్నికల నిర్వహణ కమిటీ నిర్వాహకులు తడక వెంకటేశ్, తడక రమేశ్, అంకం మురళీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా రాపోలు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పాలాది యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఏలె పాండు, సహాయ కార్యదర్శిగా ఆడెపు ఆంజనేయులు, కోశాధికారిగా కుడికాల బలరాం ఎన్నికయ్యారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

● పోక్సో చట్టం కింద కేసు నమోదు ● నిందితుడికి రిమాండ్

మోత్కూరు, జనవరి 23 : పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను మోసం చేశాడని ఓ బాలిక పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటన మండలంలోని దత్తప్పగూడెంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. దత్తప్పగూడేనికి చెందిన వల్లమాల వినయ్(25) తనను ప్రేమిస్తున్నానని వెంటపడి పెళ్లి చేసుకుంటానని మాయ మాటలతో నమ్మించి శారీరకంగా సంబంధం పెట్టుకొని పెళ్లి చేసుకోకుండా నిరాకరించాడని వలిగొండ మండలం గోపురాజుపల్లికి చెందిన బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగళవారం చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య పర్యవేక్షణలో పోలీసులు విచారణ జరిపారు. నిందితుడు వినయ్, అతనికి సహకరించిన తల్లి పుష్పపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. రామన్నపేట సీఐ మోతీరాం నేతృత్వంలో నిందితుడిని రిమాండ్‌కు తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి : జడ్పీటీసీ

సంస్థాన్ నారాయణపురం, జనవరి 23 : యువత చదువుతోపాటు క్రీడాల్లోనూ రాణించాలని జడ్పీటీసీ వీరమళ్ల భానుమతీగౌడ్ అన్నారు. మండల పరిధిలోని జనగాంలో రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహిస్తున్న మండల స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు తోడ్పడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు దోనూరి జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ గడ్డం రాములమ్మ, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుమలేశ్, బీఆర్ఎస్ నాయకులు మురళీధర్‌రెడ్డి, నరసింహ, నరేశ్, యాదయ్య, సైదులు, అంజయ్య, సాయి, రాజు, గాలయ్య పాల్గొన్నారు.

ఉరేసుకొని ఇద్దరి మృతి

అడ్డగూడూరు, జనవరి 23 : మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉరేసుకొని మంగళవారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మారం గ్రామానికి చెందిన కప్పల చామంతికి (30)చిర్రగూడూరు గ్రామానికి చెందిన చౌగోని శేఖర్ (22) వరుసకు తమ్ముడు అవుతాడు. శేఖర్ అక్క, కప్పల చామంతి ఇద్దరు తోటికోడళ్లు. వీరంతా హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నారు. శేఖర్ కూడా వాళ్ల అక్కతోనే ఉంటాడు. ఇద్దరు హైదరాబాద్‌లోని తమ ఇంట్లో ఉరేసుకొని మరణించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేతాజీ సుభాశ్ చంద్రబోస్‌కు ఘన నివాళి

ఆత్మకూరు(ఎం)లో నేతాజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతాజీ యువజన మండలి సభ్యులు

రాజాపేట : నేతాజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

నేతాజీ సుభాశ్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రామన్నపేట మండలం కక్కిరేణిలో, మోత్కూర్ మండలం పాటిమట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి నివాళి అర్పించారు. అలాగే ఆత్మకూర్(ఎం)మండల కేంద్రంలో, భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, రాజాపేటలో నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. భూదాన్‌పోచంపల్లిని చౌరస్తాలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో, అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నేతాజీ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మోత్కూరు : పాటిమట్ల ఉన్నత పాఠశాలలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు



ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎఫ్ఎస్‌సీఏ కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే కుంభానికి ఎఫ్ఎస్‌సీఏ సన్మానం

వలిగొండ, జనవరి 23 : మండల కేంద్రానికి చెందిన ఫ్రెండ్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు మంగళవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించి భవనం నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కొండూరు బాలరాజు, గౌరవ సలహాదారుడు పబ్బు ఉపేందర్‌బోస్, కుంభం వెంకట్‌పాపిరెడ్డి, బత్తిని సత్యనారాయణ, గంజి చందీప్రసాద్, సుంకి వెంకటేశ్వర్లు, బత్తిని శెట్టయ్య, గంధమల్ల స్వామిరాజ్, కీర్తి రమేశ్, కొండూరు భాస్కర్, కాసుల వెంకటేశం, పబ్బు వెంకటరమణ, కూర శ్రీనివాస్, యానాల సత్యనారాయణరెడ్డి, ఎల్లంకి మురళీ, మురారిశెట్టి కృష్ణమూర్తి, కాసుల మధుసూదన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : పల్లెపహాడ్‌లో బాధితులను పరామర్శిస్తున్న సునీతామహేందర్‌రెడ్డి

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత పరామర్శ

ఆత్మకూరు(ఎం), జనవరి 23 : మండలంలోని పల్లెపహాడ్‌కు చెందిన సుంకరి కమలమ్మ, మిర్యాల నర్సయ్య ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను మంగళవారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాలె మల్లేశ్, మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి శంకర్, పరశురాములు, పెంటయ్య, రామచంద్రయ్య, సత్యనారాయణ, బీరయ్య ఉన్నారు.

ఆలేరు : ఆలేరు పట్టణంలో ఇటీవల మృతి చెందిన ముగ్గురి కుటుంబ సభ్యులను గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పరామర్శించారు.

పోచంపల్లి చేనేత సహకార సంఘంలో ఇక్కత్ వస్త్రాలను పరిశీలిస్తున్న విదేశీయులు

చేనేత వస్త్రాలు అద్భుతం

● భూదాన్‌పోచంపల్లిని సందర్శించిన విదేశీయులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23 : సంప్రదాయ చేనేత వస్త్రాలు అద్భుతంగా ఉన్నాయని ఇంగ్లాండ్‌కు చెందిన పర్యాటకులు జానీథామ్సన్, మరియన్ కొనియాడారు. మంగళవారం వారు భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. చేనేత సహకార సంఘంలో చేనేత వస్త్రాలను పరిశీలించారు. కార్మికుల గృహాలకు వెళ్లి వస్త్రాల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేనేత వస్త్రాలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని పేర్కొన్నారు. భారత పర్యటనలో భాగంగా ఇక్కడికి విచ్చేసినట్లు తెలిపారు.

గీతాంజలి కళాశాలలో మాట్లాడుతున్న మోదీరాందేవ్‌యాదవ్

ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోదీరాందేవ్‌యాదవ్

భువనగిరి సిటీ, జనవరి 23 : పరీక్షల సమయంలో ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయొద్దని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లెగొర్ల మోదీరాందేవ్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానికంగా పలు కళాశాలలను సందర్శించి విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులను వేధించే కళాశాలలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు అన్ని కాలేజీలను పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బద్దం శ్రీకాంత్‌రెడ్డి, వాసుదేవ్, వెంకటేశ్, సుమలత, రమాదేవి ఉన్నారు.